అన్నదాతలకు దొంగల భయం..



2



2

పిల్లలతో సహ తండ్రి ఆత్మహత్య



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com

12-6-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## ప్రియాంకగాంధీని కలిసిన పీసీసీ చీఫ్



**అక్షరటుడే, ఇందూరు:** ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ కలిశారు. ఆమెను పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలు, తాజా పరిస్థితులపై చర్చించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## నారాయణ జూనియర్ కళాశాల సీజ్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్న ఆరోపణపై నారాయణ కళాశాలను సీజ్ చేశారని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. కళాశాలను శుక్రవారం సందర్శించిన డీఐఈవో రవికుమార్ పుస్తక విక్రయాలను గుర్తించి సీజ్ చేశారన్నారు. ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ నారాయణ కళాశాలలో యూనిఫార్మ్స్, బుక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా కళాశాల బిల్డింగ్‌కు పర్మిషన్ లేకున్నా కళాశాల నడుపుతున్నారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరిట తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్న నారాయణ కళాశాల గదిని, కళాశాలను డీఐఈవో సీజ్ చేశారన్నారు. జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అలాంటి కాలేజీలు, బడులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ జిల్లా కన్వీనర్ మందపల్లి అక్షయ్, సమీర్, దుర్గా దాస్, సిద్ధు, మున్నా, ప్రణీత్ తేజ, శివ, టిల్లు, సన్నీ, అశ్విత్, విగ్నేష్, చరణ్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గంగాధర్ పేర్కొన్నారు. నగరంలోని పలు ఎరువులు, విత్తన దుకాణాల్లో ఆయన వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. జిల్లాకు పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు సరఫరా జరుగుతున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. నిషేధిత గడ్డిమందులను విక్రయిస్తున్న కొందరు డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, అందుబాటులో ఉన్న రకాలను బోర్డుపై రాయాలని ఆదేశించారు. ఎవరైనా ఎరువుల కొరతను సృష్టించినా, అధిక ధరలకు యూరియా అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులను విధిగా తీసుకోవాలని సూచించారు.

## ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ 'ఆభా'..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విజయవంతంగా నడుస్తున్న 'ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్' (ఆభా) ఐడీల జారీ ప్రక్రియను ప్రైవేటు వైద్య రంగంలోనూ ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం మొదటి విడతగా యాదాద్రి-భువనగిరి జిల్లాలో దీనిని 'పైలట్ ప్రాజెక్టు'గా ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఇక్కడ విజయవంతమైతే తదుపరి విడతలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు సైతం ఈ డిజిటల్ కార్డుల విధానాన్ని విస్తరించనున్నారు.


**- అక్షరటుడే, భీమ్‌గల్**

- యాదాద్రి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్
- విజయవంతమైతే ఉమ్మడి జిల్లాలో అమలు
- క్లిక్ చేస్తే ఫోన్‌లోనే రోగి పూర్తి ఆరోగ్య చరిత్ర

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నుంచి చిన్న నర్సింగ్ హోమ్‌ల వరకు ఉన్న సుమారు 250కి పైగా రిజిస్టర్డ్ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ విధానం అందుబాటులోకి వస్తే రోగులకు, వైద్యులకు ప్రయోజనాలు కలగనున్నాయి. రోగులు ఏదైనా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లేటప్పుడు పాత ప్రిస్క్రిప్షన్లు, ఎక్స్‌రేలు, ల్యాబ్ రిపోర్టుల ఫైళ్లను భారీగా మోసుకువెళ్లాల్సి వస్తోంది. కొన్నిసార్లు అత్యవసర పరిస్థితుల్లో వాటిని మరిచిపోతే మళ్లీ కొత్తగా పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. ఆభా ఐడీ (14 అంకెల సంఖ్య) వస్తే.. రోగి అనుమతితో డాక్టర్లు కంప్యూటర్ స్క్రీన్‌పై ఒక క్లిక్‌తో గత చరిత్రనంతటినీ చూసేయవచ్చు.

### అనవసర ఖర్చులకు చెక్

ఒక ఆస్పత్రిలో చేయించుకున్న రక్త, స్కానింగ్ పరీక్షల వివరాలు డిజిటల్‌గా లాక్ అయి ఉంటాయి. దీంతో మరో ఆస్పత్రికి వెళ్లినప్పుడు ఆ నివేదికల ఆధారంగానే తదుపరి వైద్యం అందిస్తారు. దీనివల్ల రోగులకు పదే పదే పరీక్షలు చేయించుకునే ఖర్చు తప్పుతుంది. రోడ్డు ప్రమాదాలు లేదా గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో రోగి స్పృహలో లేకపోయినా, వారి 'ఆభా' కార్డు నంబర్ లేదా మొబైల్ నంబర్ ద్వారా వారి బ్లడ్ గ్రూప్ ఏంటి? గతంలో ఏవైనా జబ్బులు ఉన్నాయా? ఏ మందుల వల్ల అలర్జీ వస్తుంది? వంటి కీలక





సమాచారాన్ని వైద్యులు తక్షణమే తెలుసుకుని ప్రాణాలు కాపాడే చికిత్సను ఆలస్యం లేకుండా ప్రారంభించవచ్చు.

### వేగంగా సేవలు

ఆభా విధానం అమల్లోకి వస్తే ఆస్పత్రుల్లో ఓపీ (నిర్వహణ సులువవుతుంది. రోగికి సంబంధించిన వ్యాధి నిర్ధారణ ప్రక్రియ వేగవంతం అవుతుంది. రోగికి సంబంధించిన పాత ఫైళ్లు అందుబాటులో ఉండటంతో వైద్యులు నేరుగా చికిత్స ప్రారంభించే అవకాశం ఉంటుంది.

### ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో వందలాది హాస్పిటళ్లు ఉన్నాయి. వీటిలో నిత్యం వేలాది మంది ఓపీ సేవలు పొందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు డిజిటల్ హెల్త్ మిషన్‌లో భాగస్వామ్యమై రోగులకు ఆభా ఐడీలను లింక్ చేస్తే.. ప్రతి రికార్డు నమోదుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 20 వరకు ప్రోత్సాహకం నేరుగా ఆయా ఆస్పత్రుల ఖాతాల్లో జమ అవుతుంది. ఆన్‌లైన్ 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్' నిబంధనలతో పాటు ఈ ఆభా అనుసంధానం కూడా తోడైతే ఉమ్మడి జిల్లా ప్రైవేటు వైద్య సేవల్లో పారదర్శకత పెరిగి, సామాన్య ప్రజలకు మెరుగైన డిజిటల్ వైద్య సేవలు అందుతాయని నిపుణులు భావిస్తున్నారు.

## 13న జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాస్థాయి అస్మిత ఖేలో ఇండియా ఉమెన్ సైక్లింగ్ సిటీ లీగ్, వరల్డ్ బైస్కిల్ డే సైక్లింగ్ పోటీలు ఈ నెల 13న నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భూలోకం విజయ్‌కాంత్‌రావు వివరాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న డిచ్‌పల్లిలోని తెలంగాణ వర్సిటీలో పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. 19ఏళ్లు పైబడిన విభాగంలో మహిళలకు, 17, 18 ఏళ్ల వయస్సు జూనియర్ బాలికలకు, 13 నుంచి 16ఏళ్ల వయస్సు సబ్‌జూనియర్ బాలికలను ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ సొంత సైకిల్‌తో పాటు బర్త్ సర్టిఫికెట్, బోనోఫైడ్‌తో ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు విజయ్ కాంత్ రావ్, నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి 99128 83331లో సంప్రదించాలని కోరారు.



## ఆర్మూర్ డిపో మేనేజర్‌గా ప్రతిమారెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ప్రతిమారెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో డీఎంగా విధుల నిర్వహించిన రవికుమార్ మూడు నెలల క్రితం బదిలీపై కరీంనగర్‌కు వెళ్లగా నిజామాబాద్ డిపో2 డీఎం సాయన్నకు ఆర్మూర్ ఇన్‌ఛార్జి డీఎం బాధ్యతలు అప్పగించారు. కాగా ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ డీఎంగా ప్రతిమారెడ్డి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం బస్టాండ్, డిపోను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. 2011 నుంచి 2015 వరకు ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో ఎంఎఫ్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సర్వీసులను నడిపిస్తామన్నారు.


## వరదలపై ముందస్తు చర్యలు తీసుకుంటాం

**అక్షరటుడే, కామారెడ్డి:** వరదలపై ముందస్తు చర్యలు తీసుకుంటామని కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు కాకతీయ నగర్ కాలనీలో డ్రెయినేజీ పూడికతీత, చెత్త తొలగింపు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతేడాది కురిసిన భారీ వర్షాలతో పట్టణంలోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ వర్షాకాలంలో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా మున్సిపాలిటీ ముందస్తుగా నడుం బిగించిందన్నారు. ప్రజల భద్రత, సౌకర్యమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. వర్షపు నీరు ఎక్కడా నిలిచిపోకుండా, డ్రైనేజీలు సాఫీగా సాగేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గతంలో ఇళ్లలోకి వర్షం నీరు రావడం కారణంగా 14, 35 వార్డుల ప్రజలు నష్టపోయారని వార్డ్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత పేర్కొన్నారు.



కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంత్ రావు, కౌన్సిలర్లు అంజాద్, నిట్టు గంగాధర్, నాయకులు గణేష్, రామ్మోహన్, మోతిలాల్, భూపతి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్‌ను శుక్రవారం సందర్శించారు. కాలేజీ ఆవరణను పరిశీలించిన కలెక్టర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడాన్ని చూసి వెంటనే ఫెన్సింగ్ వేయించాలని ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ కాలేజీ వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలన్నారు. తుదిదశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో కలెక్టర్ భేటీ అయ్యారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సేవా భావంతో కూడిన నర్సింగ్ కోర్సు వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో విరివిగా ఉపాధికి లభించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ శేఖర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

## ప్రీ ప్రైమరీ సెంటర్లను అంగన్‌వాడీకు కేటాయించాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రీప్రైమరీ సెంటర్లను అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న ప్రీ ప్రైమరీ సెంటర్లను అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించి వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రధానంగా నాలుగేళ్లు ఉన్న ప్రతి విద్యార్థిని ప్రీ ప్రైమరీ సెంటర్లకు బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అంగన్‌వాడీలు నిర్వీర్యమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆర్మూర్ ఏరియా బాధ్యులు ఎల్లయ్య అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు చంద్రకళ, అంగన్‌వాడీ నాయకులు గోదావరి, లక్ష్మి, జగదాంబ, చంద్రకళ, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.



## 'ఖబడ్దార్ షబ్బీర్ అలీ.. ట్రోలింగ్ చేస్తే సహించేది లేదు..'

**అక్షరటుడే, కామారెడ్డి:** తనపై ట్రోలింగ్ చేస్తే సహించేది లేదని కామారెడ్డి మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ వార్నింగ్ ఇచ్చారు. ఉదయం నుంచి సోషల్ మీడియా వేదికగా తనపై జరుగుతున్న ట్రోలింగ్ వెనక షబ్బీర్ అలీ ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారంటూ జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర కు శుక్రవారం సుమారు 30 మంది మహిళలతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉదయం నుంచి షబ్బీర్ అలీ అన్న కొడుకు షేరు నాపై అసభ్యంగా ట్రోల్ చేస్తున్నారని, మాటల్లో చెప్పలేని పదాలతో ట్రోల్ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. షబ్బీర్ అలీని ఉద్దేశించి ''ఇంకెన్ని రోజులు మీ అరాచకాలు సాగిస్తారు.. మీకు పని చేయడం చేతకాదు.. చేసే వారిని చేయనివ్వడం లేదు.. పని చేస్తూ యాక్టివ్‌గా ఉన్నవాళ్లను టార్గెట్ చేస్తారా' అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి యువత సేవాభావంతో ముందుకు రావాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మోటివేట్ చేస్తుంటే ఇక్కడ మాత్రం ట్రోల్ చేస్తున్నారని మండిపడ్డారు. తాను వైస్ ఛైర్ పర్సన్‌గా, ఛైర్‌పర్సన్‌గా ప్రస్తుతం యువ నాయకురాలిగా వృద్ధ మహిళలకు చేయూతనిస్తున్నానని, ఎవరైనా చనిపోతే జీసీఆర్ ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు., పేదింటి ఆడబిడ్డలకు పుస్తెమట్టెలు అందిస్తున్నామని, ఇటీవల జాబ్ మేళాతో ఉద్యోగాలు కల్పించామని, ఇందిరమ్మ లబ్ధిదారులకు వంట సామగ్రి అందిస్తున్నామని వివరించారు. 'మీరు రాజకీయాలు చేసుకోండి, చేతనైన సహాయం చేయండి, మీరు చేయరు, చేసే వాళ్ళను టార్గెట్ చేస్తారా..?' అని నిలదీశారు. సీనియర్ నాయకుడిగా చెప్పుకునే మీరు ఇలాగేనా చేసేదని, కామారెడ్డిలో కత్తుల దాడికి కారణమైన వారిని వెంటేసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. గత పన్నెండేళ్లుగా ఆయన కనిపించలేదని, మళ్లీ వచ్చినప్పటి నుంచి అరాచకాలు మొదలయ్యాయని, ఒక హిందూ మహిళగా తనను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. షబ్బీర్ అలీ అన్న కొడుకు షేరు, ఆయన కొడుకు ఇలియాస్, షేక్ ముక్తార్ అనే వ్యక్తుల ద్వారానే ఈ ట్రోలింగ్ జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీని నాశనం చేసిన ఏకైక వ్యక్తి షబ్బీర్ అలీ అని విమర్శించారు. ఇటీవల వైరల్ అయిన ఆడియోలో పీసీసీ చీఫ్, పార్టీపై, మహిళలపై చేసిన వ్యాఖ్యలు సరికాదని, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసేది ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో షబ్బీర్ అలీ అన్ ఫిట్ అని, ఆయనకు ప్రభుత్వ సలహాదారుగా కొనసాగే అర్హత లేదని, ఇలాంటి మైండ్ సెట్ ఉన్న వాళ్ళు పార్టీలో ఉంటే పార్టీకి నష్టమన్నారు. తనను ఎంత ఇబ్బంది పెట్టినా ఇంకా ముందుకు సాగుతానని, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని, ఇలాంటి వ్యక్తులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఖబడ్దార్ షబ్బీర్ అలీ.. నీ సంగతి చూస్తాం అని హెచ్చరించారు.



## ఉపాధిహామీ కార్మికులకు పనిదినాలు పెంచాలి



**అక్షరటుడే, నందిపేట్:** ఉపాధి హామీ కార్మికులకు రూ.600తో పాటు 200 పనిరోజులు కల్పించాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నందిపేట్ ఎంపీడీవో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికులకు ప్రమాదాలు జరిగితే వారు కోలుకునేవరకు ప్రభుత్వం వైద్యఖర్చులు భరించాలన్నారు. మరణించిన వారికి తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గంగాధర్, మల్లయ్య, రాజలింగం, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికులను పనిలో చేర్చుకోవద్దు




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** బాల కార్మికులను పనిలో చేర్పించుకోవద్దని న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బాల కార్మిక దినోత్సవం సందర్భంగా నగరంలోని నెహ్రూ పార్క్ చౌరస్తాలో ఉన్న లేబర్ అడ్డాలో కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపల ఉన్న పిల్లలను పనిలో చేర్పించుకుంటే యజమానికి చట్టపరంగా శిక్ష పడుతుందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని వారి బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పనిలో పెట్టకుండా స్వేచ్ఛగా చదువుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే లేబర్ కార్డు తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు అమలు అవుతాయని కూలీలకు అవగాహన కల్పించారు. కార్డు లేని వారు తక్షణమే లేబర్ కార్యాలయానికి వెళ్లి తమ పేరుపై కార్డు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయశాఖ లీగల్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు రాజ్ కుమార్ సబేదార్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు ఉదయ్ కృష్ణ, న్యాయవాది మాణిక్ రాజ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి చైతన్య కుమార్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.





## కలెక్టరేట్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. కారును ఢీకొన్న లారీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని కలెక్టరేట్ సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారును లారీ ఢీకొట్టింది. రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కేసీఆర్ కాలనీలో నుంచి కారు రోడ్డుపైకి వస్తుండగా అదే రూట్‌లో వేగంగా వచ్చిన లారీ కారును ఢీకొంది. దీంతో కారు డ్యామేజ్ అయింది. ఈ ఘటనపై పోలీసులు సమాచారం సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

**ఆరుగాలం కష్టించే రైతులకు దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పొలాల వద్ద కెపాసిటర్లు, బోర్లు, వైర్లు ఎత్తుకెళ్తూ వారిని ఆర్థికంగా నష్టపరుస్తున్నారు. ఇప్పటికే అకాల వర్షాలు, ధాన్యం కొనుగోళ్లతో ఇబ్బందులు పడుతున్న రైతులకు చోరీల రూపంలో మరింత నష్టాన్ని కలిగిస్తున్నారు.**

**- గాంధారి, అక్షరటుడే**



# అన్నదాతలకు దొంగల భయం..

- పొలాల్లో కెపాసిటర్లు ఎత్తుకెళ్తున్న వైనం
- గాంధారిలో రైతుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కర్షకులు



పండించిన పంటకు మద్దతు ధర రాక ఇబ్బందులు పడ్డప్పటికీ రైతు మళ్లీ ఆ భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తుంటాడు. అలాంటి రైతులను దొంగలు ఆర్థికంగా మరింత ఇబ్బందులు పెడుతున్నారు. వ్యవసాయ మోటార్ల వద్ద ఉండే కెపాసిటర్లను ఎత్తుకెళ్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలంలోని తిప్పారంనకు వెళ్లే దారిలో పత్తి శ్రీకాంత్, బాలయ్యకు మూడెకరాల పొలం ఉంది. అందులో ఒక బోరు మోటార్ ఉండగా.. అదే శివారులో దేశ్‌పాండే రాకేష్‌కు రెండెకకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగూ పత్తి నర్సింలుకు మూడు ఎకరాల సాగు భూమి ఉంది. ఇలా ఇదే శివారులో మరికొందరికి పొలాలు ఉండగా..దొంగలు బోర్ల కేబుల్ వైర్లను ఇటీవల చోరీ చేశారు. దీనికి సంబంధించి రైతులు పోలీస్‌స్టేషన్ లోఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి పురోగతి లేదని వారు ఆరోపిస్తున్నారు.

### ఆరుసార్లు చోరీ..

తిప్పారం శివారులో ఉన్న పొలాల్లో ఇప్పటికే దొంగలు ఆరుసార్లు చోరీలకు పాల్పడ్డారు. చోరీ జరిగిన ప్రతి సారి పొలాలకు నీళ్లు పారకపోతే ఇబ్బందులు అవుతాయనే ఉద్దేశంతో రైతులు కొత్త కెపాసిటర్లు, వైర్లు బిగించుకుంటున్నారు. దొంగలు మాత్రం పదేపదే చోరీలు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.


### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం



గాంధారి మండలంలో ఆరు దొంగతనాలు జరిగితే పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు ఇచ్చాం. కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆరుకాలం శ్రమించి పండించిన పంటకు కాపాడుకోలేకపోతున్న తరుణంలో.. మోటార్ కేబుల్స్, కెపాసిటర్ల చోరీలు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి.

**– పత్తి శ్రీకాంత్, రైతు**

## అగ్నివీర్‌గా బెజ్జోర యువకుడు ప్రశాంత్ ఎంపిక



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బెజ్జోర గ్రామానికి చెందిన రాచకొండ ప్రశాంత్ భారత సైన్యంలో అగ్నివీర్ (జనరల్ డ్యూటీ)గా ఎంపికయ్యాడు. రమేష్ కుమారుడైన ప్రశాంత్ చిన్ననాటి నుంచే దేశ సేవపై ప్రత్యేక మక్కువ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే క్రమశిక్షణతో కూడిన సాధన, నిరంతర శ్రమ, పట్టుదలతో అగ్నివీర్ నియామక పరీక్షలకు సిద్ధమై తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. అత్యంత కఠినమైన శారీరక దారుఢ్య పరీక్షలు, లిఖిత పరీక్షతో పాటు వైద్య పరీక్షలన్నింటినీ విజయవంతంగా పూర్తి చేసి అగ్నివీర్ (జీడీ)గా ఎంపిక కావడం విశేషం. భారత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయడం ప్రతి యువకుడి కల అని, ఆ కలను నిజం చేసుకోవడానికి ప్రశాంత్ ఎన్నో కష్టాలను అధిగమించి ఈ ఘనత సాధించాడని గ్రామస్థులు కొనియాడారు. బెజ్జోర గ్రామం నుంచి ఆర్మీకి యువకుడు ఎంపిక కావడం పట్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామీణ ప్రాంత యువతకు ప్రశాంత్ ఆదర్శంగా నిలిచాడని, ఆయన విజయం మరెందరో యువకులకు స్ఫూర్తినిస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు ప్రశాంత్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. దేశ రక్షణలో అతడు విశిష్ట సేవలు అందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రతిఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** ప్రతిఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా.. జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో చెత్తను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒక రోజు చేసే పని కాదని.. నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఆర్డీవో కార్యాలయంలో 'సర్' సహాయ కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహాయ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీవో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పారదర్శకమైన కచ్చితమైన ఓటరు జాబితా తయారీ లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్ లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ లయన్స్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా సిద్ధ రమేష్, కార్యదర్శిగా మార మనోహర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులను సభ్యులు అభినందించారు. సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి క్లబ్ ప్రతిష్టను పెంచాలని వారు సూచించారు.


భీమ్‌గల్‌లో..


ముప్కాల్ తహశీల్దార్ కార్యాలయంలో..



మెండోరాలో..


మోపాల్ మండల..

# యూరియా యాప్ కష్టాలు తీర్చండి..

**జిల్లాలో రైతులు యూరియా యాప్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. ఈ పద్ధతిని మార్చాలని కోరారు.**

**– అక్షరటుడే, నెట్‌వర్క్**

## ఇద్దరు పిల్లలతో సహా తండ్రి ఆత్మహత్య



**అక్షరటుడే, నిజాంసాగర్:** ఇద్దరు పిల్లలతో సహా తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజాంసాగర్‌లో చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా నిజాంపేటకు చెందిన కృష్ణ(32) తన కుమారుడు రక్షిత్ (9), కుమార్తె అనన్య(5)తో కలిసి గురువారం నిజాంసాగర్ ప్రాజెక్ట్ వద్దకు వచ్చాడు. సాయంత్రం వరకు ప్రాజెక్ట్ వద్ద పిల్లలతో సరదాగా గడిపాడు. అనంతరం ముగ్గురు అక్కడ భోజనాలు సైతం చేశారు. సాయంత్రం పూట ఇద్దరు పిల్లలను నీటిలో తోసేసి తాను కూడా దూకాడు. కుటుంబ కలహాల కారణంగా ఆయన పిల్లలతో కలిసి సూసైడ్ చేసుకున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఆరేడు శివారులోని 20 గేట్ల వద్ద మృతదేహాలు లభ్యమయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. కాగా ముగ్గురి మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

## డీసీఎం వ్యాన్ ఢీకొని మేకల కాపరి మృతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డీసీఎం వ్యాన్ ఢీకొని మేకల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి, ఎల్లారెడ్డి రహదారిపై కొట్టాల్ గ్రామం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొట్టాల్‌కు చెందిన ఆలకుంట శివయ్య, బోదాస్ గంగారం, కిషన్ తమ మేకలను కొట్టం నుంచి వదిలి మేత కోసం అడవికి తీసుకెళ్తున్నారు. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు అతివేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ మేకలను, కాపరి శివయ్యను ఢీకొట్టింది. అపస్మారక స్థితిలో ఉన్న శివయ్యను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆలకుంట శివయ్యకు చెందిన 13 మేకలు, బోదాస్ గంగారాంనకు చెందిన 2 మేకలు, కిషన్‌కు చెందిన 5 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎక్సైజ్ దాడుల్లో గంజాయి పట్టివేత.. ముగ్గురు బైండోవర్



**భీమ్‌గల్, అక్షరటుడే:** మండల పరిధిలో గంజాయి విక్రయాలు, వినియోగంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం గట్టి నిఘా పెట్టింది. భీమ్‌గల్ మండలం సంతోష్‌నగర్ తండా సమీపంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భీమ్‌గల్‌కు చెందిన షేక్ మజాస్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 100 గ్రాముల ఎండు గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో గంజాయి తీసుకోవడాన్ని అలవాటుగా మార్చుకున్న మరో ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గుర్తించారు. అనంతరం వారిని, వారి తల్లిదండ్రులను ఎక్సైజ్ కార్యాలయానికి పిలిపించారు. తల్లిదండ్రుల సమక్షంలోనే గంజాయి సేవించడం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాల గురించి, చట్టపరమైన ఇబ్బందుల గురించి వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.